



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పనిచేయని

మార్చురీ ఫ్రీజర్ బాక్సులు

- మృతదేహాలను భద్రపరచాలంటే ప్రైవేటు ఫ్రీజర్ బాక్సు తెచ్చుకోవాల్సిందే
- ఇప్పటికే ఆసుపత్రిలో సేవలు, సౌకర్యాలు అంతంత మాత్రమే
- ఇప్పుడు మార్చురీ పరిస్థితీ అధ్వానం
- పట్టించుకోని అధికారులు



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న మార్చురీ ఫ్రీజర్ బాక్సులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి నిత్యం వివిధ రకాల మృతదేహాలు మార్చురీకి వస్తూ ఉంటాయి. కొన్ని మెడికో లీగల్ కేసులకు సంబంధించి పోస్టుమార్టం నిమిత్తం రాగా మరికొన్ని నాన్‌ఎమ్మెల్సీకి సంబంధించినవి మృత దేహాలు భద్రపర్చడానికి మార్చురీకి వస్తూ ఉంటాయి. రైల్వే మృత దేహాలు, గుర్తు తెలియని మృత దేహాలను మార్చురీలో భద్రపరుస్తూ ఉంటారు. నిత్యం ఐదు, ఆరు మృత దేహాలు మార్చురీలో ఉంటూనే ఉంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ మృత దేహాలను భద్రపరిచేందుకు డీప్ ఫ్రీజర్లను ఏర్పాటు చేశారు. మృతదేహాలు ఎక్కువగా ఉండడంతో ఆరు బాక్సుల నుంచి పన్నెండు బాక్సులకు పెంచారు. రెండు బాక్సులు కలిపి ఒక యూనిట్ ఫ్రీజర్ బాక్సుగా ఉంటుంది. ఇలాంటివి ప్రస్తుతం ఆరు ఉన్నాయి.

సర్వీసింగ్ ఊసే లేదు

వేసవి కావడంతో ఒక్కొక్కటి పాడవుతూ ఉన్నాయి. సాధారణంగా వాటి వినియోగం రోజూ ఉండడంతో ఎప్పటికప్పుడు సర్వీసింగ్‌లు చేయించాల్సి ఉంది. సర్వీసింగ్ చేయించకపోవడంతో మరమ్మతులు జరిగినప్పుడు మాత్రమే చేయిస్తున్నారు. ఒకేసారి పది బాక్సులు (ఐదు యూనిట్లు) పాడైపోయాయి. ఒక యూనిట్ మాత్రం తక్కువ కూలింగ్ వస్తుంది. మృతదేహాన్ని భద్రపర్చడం సాధ్యం కాదు. అసలే వేసవి కావడంతో మృత దేహాలు త్వరగా పాడవుతూ ఉంటాయి. రైల్వే మృత దేహాలు, జాతీయ రహదారిలో జరిగే రోడ్డు ప్రమాద మృత దేహాలను ఆసుపత్రి మార్చురీలో భద్రపరుస్తూ ఉంటారు. బంధువులు రావడానికి రెండు మూడు రోజులు పడుతూ ఉంటాది. ఒకొక్క సమయంలో వారం కూడా పట్టవచ్చు. గుర్తు తెలియని మృత దేహాలను ఐదు రోజులపాటు మార్చురీలో భద్రపర్చి పోస్టుమార్టం జరిపి మున్సిపాల్టీకి అప్పజెబుతూ ఉంటారు. మున్సిపాల్టీ సిబ్బంది వాటిని తీసుకెళ్లి ఖననం చేస్తూ ఉంటారు. నాన్‌ఎమ్మెల్సీ, అనాధ మృత దేహాలను ఐదు రోజుల పాటు చూసి ఆ తర్వాత ఎవరు రాకపోతే మున్సిపాల్టీకి అప్పజెప్తూ ఉంటారు. ఈ నెల 26న ఏలూరు నగరంలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకుడి మృతదేహాన్ని భద్రపర్చడానికి సాధ్యపడకపోవడంతో బంధువులు ప్రైవేటుగా ఫ్రీజర్ బాక్సు తెచ్చుకుని మృత దేహం పాడవకుండా దానిలో భద్రపర్చుకున్నారు. మృత దేహాల బంధువులు ఉన్నప్పుడు వారు ఇలాంటి ఫ్రీజర్ బాక్సును ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ రైళ్లల్లో ప్రయాణిస్తూ జారిపడి మృతి చెందిన వారు, జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వారు ఇతర రాష్ట్రాలకు చెందినవారై ఉంటే అలాంటి మృతదేహాలు ఎవరు భద్రపరుస్తారనే ప్రశ్న తలెత్తుతుంది. ఆ మృతదేహాల బంధువులు వచ్చే లోపు అవి కుళ్ళిపోయే పరిస్థితులు ఉన్నాయి.

పట్టనట్టుగా అధికారులు..

కొద్ది రోజుల నుంచి మార్చు రీలో ఫ్రీజర్లు పాడైపోయినా అధికారులు తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యేక మార్చురీకి సంబంధించి ఫోరెన్సిక్ విభాగం ఉన్నప్పటికీ సకాలంలో సత్వర నివేదికలు ఉన్నతాధికారులకు పంపకపోవడం వల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తుతోందని తెలుస్తుంది. ఎప్పటికప్పుడు పాడైపోయిన వాటిని మెమోల రూపంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు తెలియజేయాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి నిధుల నుంచి సొమ్ములను యుద్ధ ప్రాతిపదికన విడుదల చేసి వాటి మరమ్మతులు చేయించుకోవచ్చు. కానీ ఇప్పటి వరకూ ఈ పనిని అధికారులు ప్రారంభించలేదు. ప్రస్తుతం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు సెలవులో ఉండడంతో ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్‌గా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి వ్యవహరిస్తున్నారు. అధికారులు తక్షణం మార్చురీపై దృష్టి పెట్టి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆదివారం రాత్రి మార్చురీలో ఒక గుర్తు తెలియని బిక్షాటకుడి మృత దేహం మాత్రమే ఉండగా దానిని ఒక ప్రైవేటు ఫ్రీజర్ బాక్సులో భద్రపరిచి ఉంచారు. సోమవారం ఏమైనా మృతదేహాలు వస్తే ఎలా భద్రపరుస్తారనేది ప్రశ్నగా మారింది. మెడికల్ కాలేజీ ఏర్పడిన తరువాత ఆసుపత్రి వైద్య విధాన పరిషత్ నుంచి టీచింగ్ ఆసుపత్రిగా రూపొందిన తరువాత ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో సేవలు ప్రజలకు దూరం అయ్యాయని విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. చివరకు మార్చురీ అధ్వాన పరిస్థితుల్లోకి వెళ్ళిపోయింది. జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కృష్ణా కాల్వకు జలకళ





వేసవి నీటి అవసరాలకు విజయవాడ నుంచి కృష్ణమ్మ బిరాబిరా పరుగులు పెడుతూ చూపరులను ఆకట్టుకుంటోంది. నిన్న,మొన్నటి వరకు నిర్జీవంగా దర్శనమిచ్చిన ఏలూరులోని కృష్ణా కాల్వ ఈ వేసవిలో జలకళ సంతరించుకుంది. ఏలూరు పరిసరాల్లో హనుమాన్‌నగర్, రామకృష్ణాపురం, మినీబైపాస్ ప్రాంతాల్లో కాల్వ నీటితో నిండుగా కన్పిస్తోంది. ఈ నెలాఖరు వరకు నీటిని కృష్ణాకాల్వకు విడుదల చేయనుండటంతో గ్రామాల్లో పిల్ల కాల్వలు కూడా నీటితో కళకళలాడుతున్నాయి.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి



చేపల చెరువు గట్టుకు గండి కొట్టిన దృశ్యం

మా రికార్డులు.. మాకున్నాయి!

సరిహద్దులు చూపకుండానే చేపల చెరువులకు గండ్లు!

- వరి చేలల్లోకి చేరిన చెరువుల నీరు
- ఫారెస్టు అధికారుల ఒంటెద్దు పోకడలు
- లంచం ఇస్తేనే సాగు.. ధోరణిలో కక్ష సాధింపు : బాధిత చెరువుల రైతులు
- పంట నష్టపోయాం.. న్యాయం చేయాలి : వరి రైతుల ఆవేదన

నిడమర్రు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : లంచం ఇస్తేనే చెరువులు సాగు చేయాలనే ధోరణితో తమను భయభ్రాంతులను చేసి దోచుకోవడమే లక్ష్యంగా కొల్లేరులో ఫారెస్టు అధికారులు వ్యవహరిస్తున్నారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఓ పక్క కొల్లేరులో వాస్తవ పరిస్థితులను పరిశీలించడానికి సాధికారిక కమిటీ పర్యటన ఖరారవుతున్న నేపథ్యంలో ఫారెస్టు అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శిస్తున్నారు. తమ భూమి సర్వే నిమిత్తం స్థానిక సచివాలయంలో కొలతలకు దరఖాస్తు చేసుకున్నారు. మే 3వ తారీకున సర్వే చేస్తామని అధికారులు తెలిపారు. అయినా ఇవేవీ పట్టించుకోకుండా 'మా రికార్డులు.. మాకున్నాయి' అంటూ ఏకపక్ష ధోరణితో రైతులపై కక్ష సాధింపు ధోరణిని ప్రదర్శించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఫారెస్టు అధికారుల అనాలోచిన చర్య వల్ల తాము నష్టపోయామంటూ వరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించి బాధిత రైతులు తెలిపిన వివరాలివి..

నిడమర్రు మండలం పెదనింద్రకొలను - నిడమర్రు శివారు కొల్లేరు సరిహద్దు ప్రాంతంలో 16 ఎకరాల విస్తీర్ణంలోని రెండు చేపల చెరువులకు శనివారం ఫారెస్టు అధికారులు ఇరువైపులా గండ్లు కొట్టారు. అయితే చెరువుల్లో మా జిరాయితీ భూములు ఉన్నాయని, సర్వేకు దరఖాస్తు చేశామని విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోలేదని, సరిహద్దులు చూపకుండానే గండ్లు కొట్టేశారని బాధిత రైతులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు గండి కొట్టిన చెరువుల నుంచి నీరు సుమారు కిలోమీటరు దూరంలోని కోతకు సిద్ధమైన వరిచేలల్లో మోకాలు లోతు నిలిచింది. దీంతో ఏడెకరాల వరిపొలం పూర్తిగా నీటమునిగింది. సుమారు 8 లక్షల రూపాయల విలువైన పంట నష్టపోయామని, దీనికి బాధ్యత ఎవరిదని బాధిత వరి రైతులు ప్రశ్నిస్తున్నారు.

దీనిపై డీఎఫ్‌వో బి.విజయలక్ష్మి వివరణ ఇస్తూ గండి కొట్టిన చెరువుల్లో అసలు జిరాయితీ భూమి లేదని - మిగతా 8లో

> కొల్లేరు ఫారెస్టు అధికారుల తీరుపై గతంలో 'లంచం ఇస్తేనే సాగు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేకం కథనం వచ్చింది. దీనిపై విచారణ అనంతరం స్థానిక అటవీశాఖ అధికారిని సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలోనే రైతులపై కక్ష సాధింపు ధోరణితో కొల్లేరు ఫారెస్టు అధికారులు వ్యవహరిస్తూ చెరువుల రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.



చేపల చెరువులకు గండి కొట్టడంతో నీట మునిగిన వరిచేలు

మాకు న్యాయం చేయాలి



మాది చిన్న కుటుంబం. కౌలు తీసుకొని సాగు చేస్తున్నాం. పంట కోత కోసే సమయంలో నీటిముంపు వల్ల చేలో మోకాలు లోతు నీళ్ల నిలిచాయి. అటవీ శాఖ అధికారులు ఎవరికీ చెప్పకుండా పంటబోదెలోకి నీరు వదలడం వల్ల మా పంట తీవ్రంగా నష్టం పోయాం. ఏం చేయాలో తెలియడం లేదు. మాకు న్యాయం చేయాలి.

- చెన్నుబోయిన సుబ్బాయమ్మ, మహిళా రైతు, పెదనింద్రకొలను

చాలా నష్టపోయాం..



నేను ఏడు ఎకరాలు చేను కౌలు తీసుకొని సాగు చేస్తున్నాను. మాకు ఎటువంటి సమాచారం అందించకుండా చెరువు గట్లకు గండి కొట్టడం వల్ల చాలా నష్టపోయాం. చేతికొచ్చిన పంట నీళ్ల పాలయింది. మా పంట సొమ్ము సుమారు 8 లక్షల రూపాయలు పంట నేల పాలయ్యింది. అటవీ శాఖాధికారులే పంట నష్టపరిహారం చెల్లించాలి.

- చెన్నుబోయిన వెంకన్న, వరి రైతు పెదనింద్రకొలను





కామవరపుకోట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మధ్యలో నిలిచిపోయిన రైతు భరోసా కేంద్రాలు

అంతా ఆర్భాటమే

ఆంధ్రజ్యోతి పరిశీలన

వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పూర్తికాని భవనాలు

- అసంపూర్తిగా రైతు భరోసా కేంద్రాలు.. సచివాలయాలు, పలు ప్రభుత్వ భవనాలు
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- టీడీపీ ప్రభుత్వంలోనైనా మోక్షం కలిగేనా..?

గత ప్రభుత్వం హయాంలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు మధ్యలోనే నిలిచిపోయాయి. నిధుల విడుదల మాటలకే పరిమితం కావడం, పూర్తి స్థాయిలో శ్రద్ద చూపక పోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా సగంలోనే నిర్మాణాలు ఆగిపోయాయి. దీంతో పలు కార్యాలయాలు అద్దె భవనాల్లో, అరకొర వసతులు ఉన్న శిథిలావస్థలోని భవనాల్లోను కార్యాలయాలు సాగిస్తున్నాయి. అక్కడ పనిచేసే ఉద్యోగులతో పాటు వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని పలుచోట్ల అసంపూర్తి కార్యాలయాలపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో పలు విషయాలు వెలుగు చూశాయి.



ముదినేపల్లి మండలం పెనుమల్లిలో నిలిచిన రైతు భరోసా కేంద్ర భవనం



బాదంపూడిలో అసంపూర్తిగా సచివాలయ భవనం

ఉంగుటూరు : మండలంలోని పలు సచివాలయాలు అసంపూర్తిగా ఉన్నాయి. మండలంలోని కాకర్లమూడి,బాదంపూడి,తల్లాపురం,అక్కుపల్లిగోకవరం,చేబ్రోలు-2 సచివాలయాల పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై కూటమి పెద్దలు జోక్యం చేసుకుని ప్రజా ప్రయోజనం కోసం కృషి చేయాలని కోరుతున్నారు.

కామవరపుకోట : గత వైసీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో కామవరపుకోట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో లక్షలాది రూపాయలతో నిర్మించతలపెట్టిన రైతు భరోసా కేంద్రాలు మధ్యలోనే ఆగిపోయాయి. ఈ భవనాల వద్ద పిచ్చి మొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుతున్నాయి. 75 శాతం నిర్మాణం పూర్తయిన ఈ భవనాలను పూర్తి చేసి రైతులకు ఉపయోగపడేలా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. టీడీపీ ప్రభుత్వం ఈ భవనాలను నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలో ప్రభుత్వ భవనాల నిర్మాణం ముందుకు సాగడం లేదు. పలు భవనాల నిర్మాణం శంకుస్థాపనలకే పరిమితం కాగా, మరి కొన్ని భవనాల నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచి పోయాయి. ముదినేపల్లి -1 గ్రామ సచివాలయ భవన నిర్మాణం గత నాలుగేళ్లుగా పునాదుల వద్దే ఆగిపోయింది. నిర్మించిన భవనాలకు బిల్లులు మంజూరు కావడం లేదని కాంట్రాక్టర్ నిర్మాణం నిలిపేయగా, పనులను పూర్తి చేసేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. పెనుమల్లిలో 70 శాతం నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలు ఏళ్ల తరబడి పూర్తి కావడం లేదు. పేరూరు సచివాలయ భవనం నిర్మాణం పూర్తి కాలేదు. కొరగుంటపాలెం, అల్లూరు, బొమ్మినంపాడులో రైతు భరోసా కేంద్రాల భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి.



ముదినేపల్లిలో పునాదుల దశలో నిలిచిన గ్రామ సచివాలయం -1 కార్యాలయ భవనం

నాకు పేద, ధనిక తేడా లేదు

- నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి
- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



మాట్లాడుతున్న రఘురామ

కాళ్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): 'వీలైతే ఉండి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని అడ్డుపడవద్దని, తనకు పేద, ధనిక తేడా లేదు' అని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామ్రేడ్స్. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా కాలువ గట్లపై ఆక్రమణలను తొలగిస్తుంటే అడ్డగోలుగా మాట్లాడడం సరికాదని, పంట, మురుగు కాలువలపై ఆక్రమించిన వారిని వదిలిపెట్టేదే లేదన్నారు. అన్నివర్గాల వారి ఆక్రమణలు తొలగించామన్నారు. తాగునీరు కలుషితం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని కాలువ గట్లపై ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టామన్నారు. ఇటువంటి వాటికి కోర్టు కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాయని ఆ మేరకే తొలగింపులు చేస్తున్నామన్నారు. ఆకివీడు, కాళ్ళ, ఉండి, పాలకోడేరు ప్రాంతాల్లో ఇప్పటికే చాలా ఆక్రమణలు తొలగించామన్నారు. ఇటీవల పాలకోడేరు రాశి కాలువ గట్టుపై ఆక్రమణల ఇళ్లను కోర్టు తీర్పు ప్రకారం తొలగించారని, తాను ఏ పనిచేసినా కోర్టు ఆదేశాల మేరకే చేస్తున్నానని స్పష్టం చేశారు. తాను బేషరతుగా క్షమాపణ చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ 30 రోజుల సమ యం ఇస్తున్నానని వార్నింగ్ ఇవ్వడంతో కౌం టర్ ఇచ్చానన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆయన ఈవిధంగా మాట్లా డడం సబబా అని ప్రశ్నించారు. అతను ఎవరో తనకు తెలియదని, ఆయన పేరు వినలేదన్నారు. వివాదానికి ఆద్యుడైన అతనే క్షమాపణ చెప్పాలన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో తనకు పరిచయం ఉందన్నారు.

మరో పదిహేను రోజుల్లో కోర్టు ఆర్డర్‌తో మిగిలిన ఆక్రమణలు తొలగిస్తానని స్పష్టం చేశారు. ప్రజలు సంపూర్ణ ఆమోదంతో ఆక్రమణల ఇళ్లను తొలగిస్తున్నామని, తనకు, ప్రజలకు మంచి సంబంధం ఉందన్నారు. కామ్రేడ్స్. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే తన దృష్టికి తీసుకురండి. తొలగించకపోతే ఆరోపణలు చెయ్యండి అని కోరారు.

బీసీ గురుకుల ప్రవేశ పరీక్షకు 116 మంది హాజరు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తర గతిలో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా బీసీ సంక్షే మాధికారిణి నాగరాణి తెలిపారు. వట్లూరులోని గురుకుల పాఠశాలలో 80 సీట్లకు 147 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 116 మంది ప్రవేశపరీక్షకు హాజరయ్యారని వివరించారు. పరీక్ష కేంద్రాన్ని ఆమె సందర్శించారు. పరీక్షల నిర్వహణను ప్రిన్సిపాల్ లక్ష్మి పర్యవేక్షించారు.

డీఎస్సీ అభ్యర్థుల ఇక్కట్లు

లోపలి పేజీలో..

- స్టడీ సర్టిఫికెట్ల కోసం పాట్లు
- పాఠశాలల చుట్టూ ప్రదక్షిణలు
- స్కూళ్లకు వేసవి సెలవులు
- దొరకని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు
- ఉన్నతాధికారులే పరిష్కారం చూపాలి





ఆంధ్రజ్యోతి గ్రూపు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ సతీమణి శ్రీమతి వేమూరి కనకదుర్గ చతుర్థ వర్ధంతి సందర్భంగా ఆదివారం తాడేపల్లిగూడెం యూనిట్ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. బ్రాంచ్ మేనేజర్ బి.హరిబాబు, యాడ్స్ మేనేజర్ గోపాలకృష్ణంరాజు, వివిధ విభాగాల సిబ్బంది ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.

మంత్రి రామానాయుడు శ్రమదానం



పాలకొల్లు మండలం చింతపర్రు అరుంధతి పేటలో అంబేడ్కర్ విగ్రహ స్లాబ్ నిర్మాణ పనుల్లో మంత్రి నిమ్మల..

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు మండలం చింతపర్రు అరుంధతీ పేటలో ఆదివారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ స్లాబ్ నిర్మాణ పనుల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శ్రమదానం చేశారు. మంత్రి నిమ్మల స్వయంగా కంకర ఎత్తి మిల్లర్‌లో పోశారు. స్లాబ్ పైకి ఎక్కి కాంక్రీట్ పనులు చేశారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ స్లాబ్ నిర్మాణ పనులు గత అంబేడ్కర్ జయంతి రోజున ప్రారంభించారు. ఆ రోజున కూడా ఐరన్ బిగించే పనుల్లో శ్రమదానం చేశారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని, తన తండ్రి ధర్మారావు పేరిట ధర్మారావు ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో మహనీయులు అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలన్నిటికీ స్లాబ్ నిర్మాణాలను దశల వారీగా పూర్తి చేస్తానన్నారు. సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, సవరపు వెంకటేశ్వరరావు, సవరపు నాని బాబు, కొండేటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రవీంద్రకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న ప్రధానార్చకుడు

చిన వెంకన్నను దర్శించుకున్న మంత్రి రవీంద్ర

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామిని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి పీతల సుజాతలతో ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం బంగారువాకిలి నుంచి ప్రవేశించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. డిప్యూటీ ఈవో బాబూరావు ఆయనకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. రాష్ట్ర అంగన్వాడీ విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత, లంకా సత్య న్నారాయణ, పోలిన శ్రీను, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, పాకలపాటి గాంధి, జడ్పీటీసీ శామ్యూల్, మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి, మద్రాస్ రాము, నాదెళ్ల సురేంద్ర నాథ్ చౌదరి, మొగతడకల శ్రీనివాసరావు, ఏపూరి దాలయ్య, మాసిరెడ్డి హరిబాబు, ఇమ్మడి రత్నాజీ, నాదెళ్ల వెంకటేశ్వరరావు, దేవరపల్లి హేమంత్, తదితరులు పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల ఆలయ ప్రాంగణంలో సాధారణ భక్తుల రద్దీ

శ్రీవారి క్షేత్రంలో అమావాస్య ఎఫెక్ట్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : చినవెంకన్న క్షేత్రానికి అమావాస్య ప్రభావం కనిపించింది. సెలవు కావడంతో ఆదివారం ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ ఆదివారం అమావాస్య కావడంతో వందల సంఖ్యలోనే భక్తులు వచ్చారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలలో సాధారణ రద్దీ కన్పించింది. దేవస్థానం, ప్రైవేటు పాన్సీ దుకాణాలు మధ్యాహ్నానికి మూత పడ్డాయి. వైశాఖ మాసం ప్రారంభం కానుండటంతో సోమవారం నుంచి రద్దీ పెరగవచ్చని అధికారులు భావిస్తున్నారు.



అమ్మవారి అభిషేకం కోసం కలశాలతో నదీ జలాలను తీసుకు వెళ్తున్న మహిళలు

పెంటపాడులో గౌరీదేవికి ప్రత్యేక పూజలు

పెంటపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు గౌరీదేవి అమ్మవారి ఆలయ పునః నిర్మాణం చేసి 40 రోజులు అయిన సందర్భంగా వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాలతో 108 మంది మహిళలు నదీ జలాలను తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. భారీ అన్నసమారాధన చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద హోమ పూజలు నిర్వహించారు. వెలమ యువజన సంఘం సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డీఎస్సీ అభ్యర్థుల ఇక్కట్లు



- స్టడీ సర్టిఫికెట్ల కోసం పాట్లు
- పాఠశాలల చుట్టూ ప్రదక్షిణలు
- స్కూళ్లకు వేసవి సెలవులు
- దొరకని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు
- ఉన్నతాధికారులే పరిష్కారం చూపాలి

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ- 2025 రిక్రూట్‌మెంట్‌కు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు స్టడీ సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులనెదుర్కొంటున్నారు. కీలకమైన ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఉన్నట్టు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటపుడు మిగతా ధ్రువీకరణ పత్రాలతో పాటే 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉండటం, ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో గతంలో తాము చదివిన పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లను పొందేందుకు ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎం/ టీచర్లు అందుబాటులో ఉండక పోవడంతో తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నట్టు అభ్యర్థులు వాపోతు న్నారు. ఈ క్రమంలో డీఎస్సీ పరీక్షకు చదువుకు నేందుకు విలువైన సమయాన్ని కోల్పోవడమే గాక, రోజుల తరబడి స్టడీ సర్టిఫికెట్ల కోసం పాఠశాలల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారే లేరని ఆందోళన చెందుతున్నారు. డీఎస్సీకి దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభం కాగా, వచ్చేనెల 15న ముగియనుంది. ఈలోగా వేసవి సెలవులు ముగిసే అవకాశం లేకపోవడంతో స్టడీ సర్టిఫికెట్లను పొందడానికి స్కూలు హెచ్‌ఎంలను, ఉపాధ్యాయులను ఫోన్లలో సంప్రదిస్తూ అభ్యర్థిస్తుండటం మినహా ప్రత్యామ్నాయం కనబడటం లేదని చెబుతున్నారు.



30 ఏళ్ల నాటి సర్టిఫికెట్ల కోసం వెతుకులాట

డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థుల వయో పరిమితిని 44 ఏళ్లకు పెంచిన విషయం విదితమే. ఆ ప్రకారం సంబంధిత వయసు గల అభ్యర్థులు సుమారు 9 ఏళ్ల వయసులో 4వ తరగతి చదువుతారని అంచనా. దీనికనుగుణంగానే సుమారు 35 సంవత్సరాల క్రితం ప్రాథమిక పాఠశాలల్లో చదివిన 4వ తరగతి మొదలుకుని ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతివరకు స్టడీ సర్టిఫికెట్లను ఆయా పాఠశాలల నుంచి తీసుకుని డీఎస్సీ దరఖాస్తు సమయంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల స్థానికతను నిర్ధారిం చేందుకు 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పాఠశాలల్లో జారీచేసిన స్టడీ సర్టిఫికెట్లనే ప్రామాణికంగా తీసుకుంటారన్న విషయం తెలిసిందే. ఈ ధ్రువపత్రాల ప్రకారమే అభ్యర్థుల లోకల్, నాన్‌లోకల్ స్టేటస్‌ను ఉద్యోగ ఎంపికల్లో నిర్ణయిస్తారు. ఈ నేపథ్యంలో దాదాపు మూడున్నర దశాబ్దాల క్రితం నుంచి తాము చదువుకున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఆయా తరగతులకు స్టడీ సర్టిఫికెట్లను పొందడానికి ఇపుడు స్కూళ్లకు వేసవి సెలవులు పెద్ద ఆటంకంగా మారాయని అభ్యర్థులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే సమస్యకు పరిష్కారం

డీఎస్సీ, ఇతర ఉద్యోగ నియామకాల పోటీ పరీక్షలకు అవసరమైన అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలపై అవగాహన, ముందస్తు ఏర్పాట్లు చేసుకున్న అభ్యర్థులను మినహాయిస్తే, వీటిని ఇంతవరకు సమకూర్చుకోలేనివారే ఇపుడు ఆందోళన చెందుతున్నారు. ఈ కోవలో స్టడీ సర్టిఫికెట్ల సమస్య కీలకంగా మారింది. టెన్త్ పరీక్షలు ఫెయిలైన విద్యార్థులకు ప్రస్తుతం హైస్కూళ్ల రెమిడియల్ క్లాసులు నిర్వహిస్తుండటంతో హెచ్‌ఎంలు అందుబాటులో ఉంటున్నందున స్టడీ సర్టిఫికెట్లను పొందేందుకు డీఎస్సీ అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తడం లేదని తెలుస్తోంది. దీనికి భిన్నమైన పరిస్థితులు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నెలకొన్నాయి. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఈ పాఠశాలలు మూసి ఉంటున్నాయి.స్టడీ సర్టిఫికెట్లు జారీచేయాలంటే అభ్యర్థులు ఆయా సంవత్సరాల్లో చదివిన తరగతుల రికార్డులు, రిజిస్టర్లను స్కూలు ప్రధానోపాధ్యాయుడు, బోధన, బోధనేతర సిబ్బంది పరిశీలించి, ధ్రువీ కరించుకున్న తర్వాతే హెచ్‌ఎం సంతకం చేసి ఇవ్వాల్సి ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు తాళాలు వేసి ఉంటున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తాము గతంలో చదువుకున్న పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లను పొందే దుకు వివిధ జిల్లాలు, ప్రాంతాల్లో ఉంటున్నవారు వ్యయ ప్రయాసల కోర్చి తమ పూర్వపు పాఠశాలలకు వస్తుండగా, అక్కడ ఎవరూ అందుబాటులో ఉండకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. స్కూలు హెచ్‌ఎం, టీచర్లకు ఫోన్ చేసి సర్టిఫికెట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. మెగా డీఎస్సీకి రాష్ట్రంలో లక్షల సంఖ్యలోనే అభ్యర్థులు పోటీ పడతారన్న అంచనాలున్న నేపథ్యంలో దరఖాస్తుకు అవసరమైన స్టడీ సర్టిఫికెట్ల కోసం ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం పరిష్కారం చూపాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ సమస్యను డీఈవో వెంకట లక్ష్మమ్మ దృష్టికి తీసుకెళ్లగా 'ఇది కీలకమైన సమస్యే. వేసవి సెలవుల్లో రెమిడియల్ క్లాసులను తీసుకోవడానికి పాఠశాలలకు టీచర్లను రమ్మంటే ఎర్న్ లీవులను అడుగుతున్నారు. డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ సర్టిఫికెట్లను జారీ చేసేందుకు ఎదురవుతున్న సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కరించే ప్రయత్నం చేస్తా' అని వివరించారు.

త్వరలో నంది నాటకోత్సవాలు నిర్వహిస్తాం

రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్

భీమవరంలో ముగిసిన చైతన్య భారతి సాంఘిక నాటకోత్సవాలు





ఆత్మీయ పురస్కారాలు అందుకుంటున్న డాక్టర్ పి.కృష్ణంరాజు, బాలాజీ నాయక్

భీమవరం అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పుకు నాటకాలు ఎంతో దోహదపడతాయని, నాటకరంగాన్ని బతికించడానికి పరిషత్‌లు చేస్తున్న కృషి ఎనలేనిదని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో జరుగుతున్న చైతన్య భారతి 18వ జాతీయ స్థాయి సాంఘిక నాటకోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మంత్రి దుర్గేష్ హాజరై మాట్లాడారు. గత ఐదేళ్లలో కళాకరులకు ఎటువంటి పురస్కారాలు లేవని, కళా వ్యవస్థను నాశనం చేశారన్నారు. త్వరలోనే నంది పురస్కారాలను, నంది నాటకాలను నిర్వహిస్తామన్నారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాను రాజమండ్రిలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరామన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోయినా 18 సంవత్సరాలుగా ప్రతీ ఏడాది నాటకోత్సవాలు నిర్వహిస్తున్న చైతన్య భారతి కృషి ఎనలేదన్నారు.త్వరలోనే భీమవరంలో ఒపెన్ ఆడిటోరియం నిర్మించేలా సహకరిస్తామన్నారు. అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ నాటకాలకు ప్రేక్షకుల ఆదరణ తగ్గిందని కళాకారులకు పోత్సాహం అందించాలన్నారు. ముందుగా ఈ నాటిక పోటీలను ఆలపాటి తులసీ వెంకటరమణ, బోగిరెడ్డి హనుమాన్, తాడిమళ్ళ రామనరసింహంలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం హైదరాబాదు కేర్ హస్పటల్ ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ కృష్ణంరాజుకు చైతన్యభారతి ఆత్మీయ పురస్కారం, తోలేరు సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ అధ్యక్షులు చవాకుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్రమూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటుడు రచయిత ప్రయోక్త బాలాజీ నాయక్‌కు పెనుపోతుల శేషగిరిరావు రంగస్థల చైతన్య పురస్కారం ప్రదానం చేశారు. మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు,నాటక పరిషత్ వ్యవస్థపక అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, బోండా రాంబాబు, పేరిచర్ల లక్ష్మణవర్మ, కట్రేడ్డి సత్యనారాయణ, వడుపు గోపిలు పాల్గొన్నారు. నాటికల న్యాయ నిర్ణేతలుగా నాగభూషణం (గుంటూరు), రుద్రమూర్తి (భిలాయి), మానాపురం సత్యనారాయణ వ్యవహరించారు.

ఆలోచింపజేసిన నాటికలు

పోటీల్లో భాగంగా ప్రదర్శించిన రెండు నాటికలు ప్రేక్షులను అలరించాయి. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ భేదాలు, అపోహలు, చిన్న చిన్న సమస్యలు తలెత్తటం లాంటివి సహజం. తొందరపాటుతో పంతాలకు పోయి విడాకులు కావాలనుకోవడం సమంజసం కాదని..భారతీయ వివాహ వ్యవస్థలో మన సంస్కృతీ, సంప్రదాయాలే సంసార జీవితాలను అన్యోన్యంగా నడిపే దారిదీపాలు అని తెలియజేసిన నాటిక అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'విడాకులు కావాలి' ఆలోచింపజేసింది.

సామాన్యులు ఖర్చు తక్కువని జనరల్ బోగిలో ప్రయాణించటానికి ఇష్టడతారు. రైల్వే జనరల్ బోగీలు తగ్గించేయడంతో జనరల్ బోగీలన్నీ కిక్కిరిసి ఉంటున్నాయి. జనరల్ బోగి ప్రయాణికుల పరిస్థితి, ఇబ్బందులను కళ్లకు కట్టినట్టు తెలిపిన శ్రీ సాయి ఆర్ట్స్ గుంటురు వారి 'జనరల్ బోగీలు' అందరినీ అలరించింది.

కొంతేరులో ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

యలమంచిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి మండలం కొంతేరులో యూత్‌క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 43వ అఖిల భారతస్థాయి నాటిక పోటీల్లో మూడో రోజు ఆదివారం ప్రదర్శించిన శ్రీసౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి 'దేవరాగం', శ్రీనటీనట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారి 'అనూహ్యం' నాటికలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. మానవ జీవితంలో అన్ని బంధాలకన్నా జన్మనిచ్చిన బంధం బలమైనది.. ఈ బంధం విచ్ఛిన్నమైతే తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపమవుతుంది.. వారిని విడవకుండా కంటికిరెప్పలా కనిపెట్టుకుని ఉండే ఆ వృద్ధాప్యమే ఆ తల్లిదండ్రులకు మలిదశలో మధురమైన బాల్యం అవుతుందన్న కథాంశంతో 'దేవరాగం' నాటిక ప్రదర్శించారు. తల్లిదండ్రుల ఆస్తి కోసం కుటిలవ్యూహాలతో అనునిత్యం మోసం చేస్తున్న కన్న కొడుకులకు తగిన గుణపాఠం చెప్పాలంటే ప్రతి తల్లీ, తండ్రీ అనూహ్యమైన వ్యూహాలతో ముందుకు సాగాలని, కొడుకులు వారసత్వ సంపదను అనుభవించడం కోసం బిచ్చగాళ్లలా ఎదురుచూడకుండా స్వయంకృషితో,ఆత్మాభిమానంతో జీవించాలనే సందేశంతో 'అనూహ్యం' నాటిక ప్రదర్శించారు.



స్థిరంగా కూరగాయ ధరలు

పెంటపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయల ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఆదివారం మార్కెట్‌లో ధరలు ఇలా ఉన్నాయి. కేజీ టమాట రూ.20, బీరకాయలు కేజీ రూ.40, దొండకాయలు రూ.30, తెల్ల వంకాయలు రూ.50, నల్ల వంకాయలు రూ.40, అల్లం రూ.60, క్యాబేజి రూ.30 , బీట్‌రూట్ రూ.30 , బీన్స్ రూ.80, కాప్సికం రూ.60 , ఉల్లిపాయలు 5 కేజీలు రూ.100, పచ్చి మిరపకాయలు రూ.40, దోసకాయలు రూ.30, మునగకాయలు 4 రూ.20, అనపకాయ ఒక్కటి రూ.15, , అరిటి కాయలు 3 రూ.20 చొప్పున విక్రయించారు.



తీరంలో సందర్శకుల సందడి

పేరుపాలెం తీరంలో సందర్శకుల తాకిడితో సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడం, పగలంతా ఎండ, ఉక్కబోతలతో సతమతమైన పలువురు కుటుంబ సమేతంగా పేరుపాలెం సాగర తీరానికి చేరుకుని సేదతీరారు. ఇక్కడ చల్లని గాలులు ఆస్వాదిస్తూ సముద్ర స్నానం చేసి ఉల్లాసంగా గడిపారు. తీరంలో కొబ్బరి, సరుగుడు తోటల్లో సరదాగా తిరిగారు.

- మొగల్తూరు (ఆంధ్రజ్యోతి)

అనారోగ్యం తట్టుకోలేక వివాహిత ఆత్మహత్య

లింగపాలెం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం గ్రామానికి చెందిన చుంచులేటి పార్వతి (26) గత కొంతకాలంలా అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆ బాధ భరించలేక ఆదివారం ఉదయం ఆమె భర్త చికెన్ సెంటర్‌కు వెళ్లిన సమయంలో ఇంటిలో ఉరి వేసుకుందని తెలిపారు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు గమనించి లింగపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని చెప్పారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న తెలిపారు.

మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య



టి.నర్సాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): ప్యాన్‌కు ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. వల్లంపట్ల పంచాయతీలోని తిరుపతిపాడుకి చెందిన నుల కాని పూర్ణసాయి పవన్ (22) పదో తరగతి వరకు చదివి వ్యవసాయ పనులు చేసుకుంటు న్నాడు. ప్రతీరోజు రాత్రి ఇంటికి ఆలస్యంగా వస్తు న్నాడని తండ్రి సిద్దిరాజు మంద లించటంతో మన స్థాపానికి గురైన సాయిపవన్ ఇంటిలోని ప్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. తల్లిజ్యోతి ఫిర్యాదుతో ఎస్ఐ జయ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తాటిచెట్టును ఢీకొని యువకుడి మృతి

మొగల్తూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేపీ పాలెం బీచ్ రోడ్డులో శనివారం అర్ధరాత్రి బైక్‌పై వెళుతున్న ఒక యువకుడు రోడ్డుపక్కన గల తాటిచెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వీరవాసరానికి చెందిన మల్లుల నాని (20), అతని మిత్రుడు గుడాల హేమంత్ సాయి బైక్‌పై వెళుతూ కేపీ పాలెం తీరంలో తాడిచెట్టును ఢీకొట్టారు. బైక్ నడుపుతున్న నాని ఘటనా స్థలంలోనే మృతి చెందగా హేమంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు తండ్రి మల్లుల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వాసు తెలిపారు.

క్రైం కార్నర్

గోస్తనీ నదిలో గుర్తు తెలియని మృతదేహం

పాలకోడేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మోగల్లులోని గోస్తనీ నది వంతెన వద్ద విస్సాకోడేరు పరిధిలో నదిలో గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని గుర్తించారు. విస్సాకోడేరు వీఆర్వో పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి వర్మ తెలిపారు. మొగల్లు వెళ్లే గోస్తనీనది వంతెన వద్ద విస్సాకోడేరు పరిధి వైపు ప్రవహించే కాలువలో మృతదేహం ఉండటాన్ని గుర్తించి ఆ మృతదేహాన్ని బయటకు వెలికి తీశారు. బ్లూ రంగు ఫాంటు, రంగు రంగుల షర్టు ధరించాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

పెనుమంట్ర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పెను మంట్ర మండలం వెలగలవారిపాలెం గ్రామం దగ్గరలో మోటారు సైకిల్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోవడంతో మోటార్ సైక్లిస్టు తలకు తీవ్ర గాయాలయ్యాయి. నిడదవోలు మండలం కాట కోటేశ్వరం గ్రామానికి చెందిన జుత్తిగ శ్రీరా ములు (45) తన కుమారునితో కలసి వీరవా సరం మండలం మడుగు పోలవరం గ్రామంలో తమ బంధువుల ఇంటికి మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. వెలగలవారిపాలెం వద్ద పడిపోవడంతో స్థానికులు వెంటనే స్పందించి పెనుమంట్ర అత్యవసర వాహనానికి సమాచారం అందించారు. 108 సంఘటన స్థలానికి చేరుకొని ఈఎంటీ బాలకృష్ణ, పైలట్ మహేష్ సహకారంతో క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం తణుకు ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు.

వివాహితను గాయపరిచిన వారిపై కేసు నమోదు

ఉండి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వివాహితను గాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్ఐ మహమ్మద్ నజీరుల్లా తెలిపారు. ఉండిమండలం పెదపుల్లేరు గ్రామంలో గ్రామానికి చెందిన కర్రి సాయి లక్ష్మీ తన ఇల్లు దెబ్బతినడంతో దానిని విప్పి వేయించింది. అదే ప్రాంతానికి చెందిన రాయి శ్రీను, మరో ఇరువురు ఇంటి హక్కుల గురించి అడిగి గొడవ పడ్డారు. రాయి శ్రీను ఆమెను ఇను పరాడ్డుతో కొట్టి గాయిపరిచాడు. ఆమె భీమవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంది. ఆదివారం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యర్రాయి చెరువులో కొనసాగుతున్న పోలీస్ పికెట్

తణుకు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :తణుకు రూరల్ మండలం,ఇరగవరం మండలం పరిధిలోని యర్రాయి చెరువు గ్రామాల్లో నెల కొన్న ఉద్రిక్త పరిస్థితుల్లో పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ ఆదివారం కూడా కొనసాగింది. తణుకు రూరల్ మండలం యర్రాయి చెరువు గ్రామస్తులు గ్రామ పరిధిలోని ఉమ్మడి చెరువు గట్టుపై ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటును ఇరగవరం మండల పరిధిలోని యర్రాయి చెరువు గ్రామస్తులు అడ్డుకోవడంతో ఏర్పడిన ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో రెండు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ సమస్య పరిష్కారానికి అందరూ సహకరించాలని పెద్దలను కోరుతున్నారు.



ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల లగేజీలను తనిఖీలు చేస్తున్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు

ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల భద్రత దృష్ట్యా గవర్నమెంట్ రైల్వే పోలీసులు, రైల్వేప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు ఉమ్మడిగా ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైల్వే డీఐజీ సత్య ఏసుబాబు, రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ ఆదేశాలతో విజయవాడ రైల్వే డీఎస్పీ రత్నరాజు, రైల్వే సీఐ దుర్గారావులు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌కు వచ్చారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులతో కలిసి ప్లాట్‌ఫామ్స్‌లోని ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేశారు. వెయిటింగ్ హాల్స్, బుకింగ్ కౌంటర్లు, రిజర్వేషన్ కౌంటర్లు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పలు ప్రయాణికులను ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్తున్నారో వివరాలను తెలుసుకున్నారు.

మెగా డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన కాపు, బలిజ, తెలగ, ఒంటరి అభ్యర్థులకు మెగా డీఎస్సీ - 2025 ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమానికి, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్.పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి హెచ్‌టీటీపీ.//ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి సోమవారంతో ఆఖరని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు మానవత బహుమతుల అందజేత

చింతలపూడి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేసింది. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలో ప్రథమ స్థానం సాధించిన కానూరి పూజితకు ఐదువేలు, బి.సౌమ్యకు నాలుగు వేలు, పి.కారుణ్యకు మూడు వేల రూపాయలు అందచేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, సోమశేఖర్, రాజు, చిన్నారావు పాల్గొన్నారు.

టీడీపీ కైకరం గ్రామ కమిటీ ఏకగ్రీవం


ఎన్నికైన గ్రామ కమిటీ

ఉంగుటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కైకరం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవమైంది. అధ్యక్షునిగా యెగ్గిన సీతారాం కుమార్ (పెదబాబు), ఉపాధ్యక్షునిగా రంది రవి, కార్యదర్శిగా గున్నం రాంబాబు ఎన్నికయ్యారు. బీసీ సెల్ అధ్యక్షునిగా గొరిపర్తి రాటాలు, తెలుగు రైతు అధ్యక్షునిగా గుత్తికొండ మోహన్, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా బీర చిన్న, తెలుగు యువత అధ్యక్షునిగా మాసాబత్తుల కృపరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ చింతల శ్రీనివాస్, సర్పంచ్ సలగాల గోపి, ఎంపీటీసీ చెన్ను సత్యవాణి పాల్గొని నూతన కమిటీని అభినందించారు.

షాపుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

ఏలూరురూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సూర్య రెసిడెన్సీలో ఆదివారం ఎలక్ట్రికల్, శానిటరీ, ప్లంబింగ్, షాపుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మద్దుల శ్రీనివాసరావు, అధ్యక్షులుగా కొల్లూరి మణికంఠ, సెక్రటరీగా కొల్లా సుధీర్, కోశాధికారిగా మాలి భగవాన్, ఉపాధ్యక్షులుగా మానేపల్లి సత్యనారాయణ, వందనపు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా ఎం.తారారామ్, అడ్వైజరీ సభ్యులుగా లింగమల్లు శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ, ఎనిమిది మంది కమిటీ సభ్యులను ఎన్నుకోగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా మానేపల్లి సత్యనారాయణ సంఘం అభివృద్ధికి రూ.25 వేల విరాళాన్ని ప్రకటించి అందజేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : రాట్నాలకుంటలో కొలువైన శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.

వైశాఖ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మే 3 నుంచి 12వ తేదీ వరకు వైశాఖ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సుదర్శన కలశ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకాన్ని నిర్వహించేందుకు ఆలయాన్ని దేవదాయ శాఖ అధికారులు ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు, పూజలు నిర్వహించేందుకు యాగశాలను నిర్మించారు. 9న శ్రీత్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామిజీ ఆలయ విమాన సుదర్శన శిఖర ప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీశ్ కుమార్, ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు తెలిపారు. 10న శ్రీవారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరుగుతాయన్నారు.

గుబ్బలమంగమ్మ ఆలయం కిటకిట


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మన్యం అటవీ ప్రాంతంలో కొలువైన వన దేవత గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు ఏజెన్సీకి తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అనేక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వేసవి కావడంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

కుక్కునూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలంటూ మే 20న జరిగే దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో దాచారం గ్రామంలో డివిజన్ స్థాయి శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీవ్రమైన అన్యాయం చేయాలని చూస్తోందన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయి కిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు, షేక్ వలిబాషా, సురేశ్, రమాదేవి పాల్గొన్నారు.

నేడు 'కోకో రైతుల చలో గుంటూరు'


పెదవేగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : కోకో రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం నిర్వహించనున్న కోకో రైతుల చలో గుంటూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ కోకో రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పెదవేగి మండలం విజయరాయిలో ఏర్పాటు చేసిన కోకో రైతుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్ ధరల ప్రకారం కోకో గింజలకు మద్దతు ధర కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పంద నిర్ణయం ప్రకటించాలన్నారు. గుంటూరు సమీపంలోని చుట్టుగుంటలోని ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం పది గంటలకు కోకో రైతుల ధర్నా జరగనుందని తెలిపారు. ఈ ధర్నా విజయవంతం చేయడానికి రైతులంతా హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పానుగంటి అచ్యుతరామయ్య, గుదిబండి వీరారెడ్డి, కొసరాజు రాధాకృష్ణ, కె.సతీశ్‌బాబు, నాగరాజు, శ్రీనివాసరాజు, రామిరెడ్డి, సత్య నారాయణ పాల్గొన్నారు.

మా రికార్డులు.. మాకున్నాయి!

(ఐదో పేజీ తరువాయి)

శాటిలైట్ సర్వే ద్వారా తెలుస్తోందని, ప్రభుత్వ భూమి ఉన్న చెరువులను స్వాధీనం చేసుకుంటున్నట్టు తెలిపారు. రైతులకు మూడు నెలల నుంచి గడువు ఇస్తూనే ఉన్నామన్నారు. అలాగే గండి కొట్టిన చెరువుల పరిధిలో చుట్టుపక్కల 780 మీటర్ల వరకు ఎటువంటి వరిపొలాలు లేవని, కొంతమంది కాల్వకు అడ్డుకట్ట వేయడం వల్ల నీరు ముందుకు వెళ్లే మార్గం లేక వెనక్కి ఎగదన్నిందని, మోటార్లు వేసి చేలో నీరు తోడించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నీటమునిగిన పంట పొలాల పరిశీలన..


పంట పొలాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నీట మునిగిన పంట చేల రైతులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. నిడమర్రు శివారు ప్రాంతంలో చేపల చెరువులకు గండ్లు కొట్టడం వల్ల నీరు వరిచేలలోకి చేరడంతో బాధిత వరి రైతులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు ముగ్గళ్ల యాకోబు, ఉమామహేశ్వరరావు, హరిబాబు పాల్గొన్నారు.

చిన్నపాటి పనులు కూడా పట్టించుకోరా?

నగర పాలక సంస్థ తీరుపై ప్రజల అసహనం


డ్రెయినేజీపై సరిగా పెట్టని సిమెంటు మూతలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని ప్రధాన ముఖ్య కూడళ్లలో చిన్నపాటి సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని రైతు బజారు ముఖ ద్వారం వద్ద డ్రెయినేజీ మూతలు తొలగించి పూడిక తీసి అనంతరం శాశ్వత పద్ధతిలో మూతలు తిరిగి బిగించకపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరేమిటని రైతు బజారుకు వచ్చే ప్రజలు విమర్శిస్తున్నారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వెనుక వైపున ఉన్న రైల్వే అండర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కే తరుణంలో తూర్పు వైపున ఆరు నెలల క్రితం ఫుట్‌పాత్‌పై కుండీని ఏర్పాటు చేశారు. ఆ కుండీ అధిక బరువు కారణంగా ఫుట్ పాత్‌పై ఉన్న స్లాబ్ కుంగిపోయింది. దీంతో ఫుట్‌పాత్‌పై రాకపోకలు సాగించేందుకు ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇలాంటి చిన్న పనులు కూడా పట్టించుకోకపోతే ఎలా అంటూ నగర పాలక సంస్థపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.



వంతెనపై పాడైన ఫుట్‌పాత్

ఉగ్రదాడిపై నిరసనల వెల్లువ


శాంతి ప్రదర్శన నిర్వహిస్తున్న సన్ సిటీ వాసులు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు అమ్మానాన్న ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ మారం హనుమంతరావు పేర్కొన్నారు. ఈ మేరకు బిర్లా భవన్ సెంటర్ నుంచి వైఎంహెచ్‌ఏ హాలు వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అడ్వకేట్ సురేశ్, గంగాధరరావు, బండి వాసు, కరీముల్లా జావీదు, జే.నాగేశ్వరరావు, జానా వాసు, విజయవర్మ, సేనాపతి నగేశ్, చిన్నకోట మాధవ, గెల్లా శ్రీను, పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : ఉగ్రదాడిని అంజుమన్ సంస్థ ఖండించింది. మృతులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ అధ్యక్షుడు ఎండీ జబీవుల్లా, సెక్రటరీ ఎండీ అహ్మదుల్లా షరీఫ్, ట్రెజరర్ షేక్ సిరాజ్‌బాషా, అంజుమన్ వ్యవహారాల అధ్యక్షులు రాజా అహ్మద్, రియాజ్ అలీఖాన్, సలహాదారుడు ఇలియాస్ పాషా పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సానుభూతి

● ఏలూరు అర్బన్ : ఉగ్రదాడిని ఖండిస్తూ ఆదివారం రాత్రి స్థానిక సన్ సిటీ గేటెడ్ కమ్యూనిటీ వాసులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సన్‌సిటీ ప్రతినిధి హేమసుందర్ మాట్లాడుతూ కశ్మీర్ ప్రశాంతతకు భంగంకలిగించేందుకు పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దేశంలో అలజడి సృష్టిస్తున్నారని అన్నారు. శాంతి ప్రదర్శనలో వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఉంగుటూరు మండల మానవత సంస్థ పేర్కొంది. ఆదివారం నారాయణపురంలో మానవత మండల సమావేశం నిర్వహించగా మండలాధ్యక్షులు వేగేశ్న రంగరాజు అధ్యక్షత వహించగా రాష్ట్ర విస్తరణ కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకి రామరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కైకరం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని చల్లా కృపా ఏంజెల్‌కు రూ.10 వేలు ఫీజును సంస్థ తరపున అందించారు. కార్యక్రమంలో రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపీ, కార్యదర్శి గంజి రవి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, వేగేశ్న సూర్యనారాయణరాజు, పుసులూరి ప్రకాశ్, శీతాల సత్యనారాయణ, పాతూరి వంశీ, బొమ్మిడి అప్పారావు, రామిరెడ్డి వెంకటరెడ్డి, నిమ్మల బాబూరావు, సతీశ్, ప్రతాప్ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం : ఉగ్రదాడికి కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. టి.నర్సాపురంలోని మసీదు వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో రవి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రక్షణ వ్యవస్థను గాలికి వదిలేసిందని, అందుకే ఉగ్రమూకలు దేశంలోకి చొరబడ్డారని అన్నారు. ఉగ్రవాదులు చొరబాటుకు, మదకద్రవ్యాల రవాణాకు బీజేపీ ప్రభుత్వం తలుపులు తెరుస్తుందన్నారు. కేంద్రం వక్ఫ్ సవరణ చట్టాన్ని తెచ్చి ఆస్తులను దోచుకోవడానికి ప్రయత్నం చేస్తోందన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలతో దేశంలో అశాంతిని సృష్టించడమే పనిగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అనుమోలు మురళీ, గుడేల్లి వెంకట్రావు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

● జంగారెడ్డిగూడెం : ఉగ్రదాడిని ఖండిస్తూ ఆదివారం జంగారెడ్డిగూడెం టౌన్ వాకర్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్మించారు. కార్యక్రమంలో సిటీ కేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్, చామర్తి శ్రీరాములు, రిటైర్డ్ పి.డి. నరసింహరాజు, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వాసా సత్యనారాయణ, దండు ధనరాజు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

సమస్యల పరిష్కారానికి అర్జీల స్వీకరణ

పెదవేగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : మత్స్యకార కుటుంబాల్లో వెలుగులు తీసుకురావడమే వేట నిషేధ సాయం విడుదల లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఇది కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీల అమలులో మరో విజయమన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించి, పరిష్కారానికి అనువుగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వేట నిషేధ సాయం రూ.20 వేలు పెంచి ఇవ్వడం ప్రభుత్వ పథకాల్లో ఇదొక మైలురాయి అని అన్నారు. వేట సమయంలో మత్స్యకారులు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం, డీజిల్‌పై లీటరుకు రూ.9 రాయితీ ఇస్తున్నట్టు ప్రభాకర్ తెలిపారు.

● ఏలూరు టూటౌన్ : అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేలా పాలన సాగుతుందన్నారు. అధిక సంఖ్యలో అందరికీ ఇళ్లు, పింఛన్లు, ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. లబ్ధిదారులకు ఇళ్లు, కొత్త పింఛన్లు ఇవ్వడానికి కృషి చేస్తున్నామన్నారు. సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణ రావు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు నిర్వహిస్తామన్నారు. 8 నుంచి 8.30 కథలు వినడం, 10 గంటల వరకు పుస్తకాలు చదవిస్తామన్నారు. పది నిమిషాల విరామం అనంతరం 10.10 నుంచి 10.30 వరకు పుస్తక సమీక్ష, అనంతరం 11గంటల వరకు ఓపెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్ ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

● లింగపాలెం : గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి సి.హెచ్.వెంకట రమణ అన్నారు. సోమవారం నుంచి మే 6వ తేదీ వరకు ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయంలో ఈ వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి సి.హెచ్.వెంకట రమణ తెలిపారు. ఈ తరగతులకు విద్యార్థులు హాజరయ్యి తమలో దాగి ఉన్న ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు. ఈ తరగతులకు ఉపాధ్యాయులు హాజరయ్యి వివిధ అంశాలపై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పలు అంశాలు బోధిస్తారని ఆమె తెలిపారు.

● పెదవేగి : పెదవేగి శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయని శాఖా గ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు వేసవిలో ఖాళీ సమయాన్ని పుస్తక పఠనానికి వినియోగించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి, విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివారని అన్నారు.

మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు అంధకారమవుతోందని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు సమీపంలోని దుగ్గిరాలలోని డీపాల్ కాలేజీ ప్రాంగణంలో 19(ఎ) బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక శిక్షణ క్యాంపు కాలేజీ విద్యార్థులకు ఆదివారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల ముఠాను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఈగల్ టీమ్ ఏర్పాటు చేశారన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించినా, విక్రయాలు జరిపినా వెంటనే 112కు సమాచా రం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో 19(ఎ) బెటాలి యన్ ఎన్‌సీసీ కల్నల్ అమిత్‌పాండే సుబేదార్ ఆది నారాయణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్ బాషా, ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.


ప్రచార పత్రాలు విడుదల చేస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్


కరాటేలో తలపడుతున్న చిన్నారులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : కరాటేలో తమ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారని షోటోకాన్ కనిన్‌జుకూ కరాటే అసోసియేషన్ నిర్వాహకులు కోచ్ డీఎల్ నారాయణ తెలిపారు. ఆదివారం గులాబీ తోటలోని సాయిబాబా మందిరం ఆవరణలో అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కాంపిటేషన్‌తో పాటు ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎన్.నారాయణ మాట్లాడుతూ ఈ శిక్షణలో బ్రౌన్, ఆరెంజ్, ఎల్లో వంటి విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. త్వరలో డెహ్రాడూన్ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి నాగల శివ మాట్లాడుతూ మారుతున్న సమాజంలో విద్యార్థినులు కరాటే నేర్చుకుంటే వారికీ ఆత్మరక్షణగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కోచ్ ఇబ్రహింబేగ్, రాజేశ్వరి, రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉధృతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వి.రమణ పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా గిరిజన కార్పొరేషన్ సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సభలో పాల్గొని రమణ మాట్లాడారు. కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్రం లేబర్ కోడ్‌ను తీసుకొచ్చిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చేస్తున్న చట్టాలను రద్దు చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను రెగ్యూలర్ చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, మేడేను పోరాట దీక్ష దినాన్ని ఘనంగా నిర్వహించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె.కిశోర్, చందు పాల్గొన్నారు.

సోషలిస్టు రాజ్యమే లక్ష్యం : సీపీఐ


ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : దేశంలో సోషలిస్టు రాజ్యమే లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఆర్.శ్రీనివాసడాంగే, పళ్లెం కిశోర్‌లు తెలిపారు. ఆదివారం సీపీఐ కార్యాలయం వద్ద మేడే సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ ఆదివారం రెండో రోజు నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అప్పలరాజు, భజంత్రి శ్రీనివాస్, టోర్నమెంట్‌కు చీఫ్ ఆర్బిటర్‌గా కృష్ణకుమారి, సూర్యనారాయణ, కోచ్ లక్ష్మీనారాయణ, సహాయకులు లక్ష్మి పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా కె.ఎస్.ఎస్.కార్తీక, టాప్-5లో కె.ఓంకార్, ఎం.నాగరాజు, జి.అఖిల సాయి, పుండరీనాథ్ ఎం.కుశాంక్, శ్రీవిశ్వలు విజేతలయ్యారని, వివిధ ఏజ్ గ్రూపుల్లో మరో 20 మంది గెలుపొందారని, ఐదుగురికి ప్రత్యేక కన్సొలేషన్ బహుమతులు అందజేశారు.

వైద్య భగవానుడికి అభిషేకాలు



ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : చైత్ర మాసంలోని అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయంలో భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆదిశర్మ భక్తులతో సూర్య నమస్కార పూజలు జరిపించారు. ఆలయ ఛైర్మన్ కోరాడ రెడ్డి, పూర్ణ మిత్రబృందం భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు నగరంలోని పలు డివిజన్లలో శివాలయాల వద్ద స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ మేరకు సత్యనారాయణపేటలోని రేవులింగేశ్వర స్వామి, దక్షిణపు వీధిలోని మార్కండేయ స్వామి, జరాపహరేశ్వర స్వామి, అగ్రహారంలోని నగరేశ్వరస్వామి, పాత శివాలయం, పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో అమావాస్య పూజలు నిర్వహించారు.

కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడికి పరామర్శ


ఎమ్మెల్యే ముప్పిడిని పరామర్శిస్తున్న పల్లా

ద్వారకా తిరుమల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఆయుష్ ఆసుపత్రిలో ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, స్థానిక నేతలతో కలిసి ఆదివారం పరామర్శించారు. పదిరోజుల క్రితం తీవ్రమైన కడుపునొప్పితో బాధపడిన ఆయనను హుటాహుటిన విజయ వాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయనకు ఆపరేషన్ చేశారు. ఈ క్రమంలో పల్లాతో కలిసి టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కూరాకుల బుజ్జి యాదవ్, రాసప్రోలు బాలరాజు, పండు తదితరులు పరామర్శించారు. తాను ప్రస్తుతం ఆరోగ్యం గానే ఉన్నానని, సోమవారం డిశ్చార్జి చేస్తారని ఆ రోజు నుంచి పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ముప్పిడి 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు.

నేడు నియోజకవర్గ సమావేశం

చింతలపూడి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నియోజకవర్గ కూటమి పరిశీలకుడు అల్లాడి స్వామినాయుడు సోమవారం చింతలపూడి రానున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నాలుగు మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశంలో పాల్గొననున్నారు. ఈసమావేశానికి నియోజకవర్గ నాయకులంతా హాజరుకావాలని నాయకులు కోరారు.

శనీశ్వరాలయంలో అభిషేకాలు

కామవరపుకోట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : చైత్ర అమావాస్య సందర్భంగా ఆడమిల్లిలోని శనీశ్వరాలయంలో భక్తులు స్వామికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు, తైలాభిషేకాలు నిర్వహించి దోష నివారణ పూజలు జరిపి స్వయంపాక దానాలు అందజేశారు. గతించిన పితృదేవతల పేరుతో అర్చకులకు స్వయంపాకాలు అందించారు. అదేవిధంగా కామవరపుకోటలోని వీరభద్రస్వామి, తడికలపూడిలోని గాంగేశ్వర స్వామి ఆలయాల వద్ద అమావాస్య అభిషేకాలతో భక్తులు ఆరాధించారు.


రోడ్డు పక్కన ఉన్న సిల్ట్ గుట్ట

నాలుగు నెలలైనా తొలగించని సిల్ట్

ఏలూరుకార్పొరేషన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని బావిశెట్టివారిపేట కనకదుర్గాంబ ఆలయం నుంచి మురుగు కాలువ మీదుగా నవాబుపేటకు వెళ్లే రహదారిలో రోడ్డుపక్కనే అసౌకర్యంగా సిల్ట్ గుట్టలు ఉన్నాయి. వీటి వల్ల ప్రజల రాకపోకలు సాగించేందుకు అసౌకర్యానికి గురవుతున్నారు. నాలుగు నెలల క్రితం ఈ మురుగు కాలువలో పూడికలు తీసి సిల్ట్‌ను రోడ్డు మీదే గుట్టగా వేశారు. అయితే అప్పటి నుంచి ఈ గుట్టలు తొలగించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయి.

నేడు టీడీపీ సమావేశం

బుట్టాయగూడెం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ మే 2న రాజధాని పనుల ప్రారంభోత్సవానికి వస్తున్నందున టీడీపీ ఆదేశాల మేరకు సోమవారం బూసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

నకిలీ ఫెవిక్విక్ ప్యాకెట్ల స్వాధీనం

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : బుక్ చిరిగినా, ప్లాస్టిక్ అతికించాలన్నా ఐదు రూపాయల ఫెవిక్విక్ వాడతాం. ఏ కిళ్లీ షాపు వద్దకు వెళ్లినా ఇవి ఉంటాయి. అయితే కొంత మంది కేటుగాళ్లు వీటికి నకిలీలు చేసి విక్రయిస్తున్నారు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులు జెనర్ధీపేట న్యూమార్కెట్ దగ్గర ఉన్న శ్రీలక్ష్మి ప్రసన్న జనరల్ షాపులో 246 నకిలీ ఫెవిక్విక్ ప్యాకెట్లను గుర్తించి షాపు నిర్వాహకుడు కిలానీ శ్యామ్ కుమార్‌పై కేసు నమోదు చేశారు. అతనికి అవి ఎలా వచ్చాయనేదానిపై విచారణ చేపట్టారు.

టెన్త్ టాపర్లకు బహుమతులు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను మానవత సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. మానవత సంస్థ మండల అధ్యక్షుడు దేవరపల్లి రాయుడుబాబు ఆధ్వర్యంలో శ్రీనివాస ఐడియల్ పబ్లిక్ స్కూల్, డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో పరసా వెంకట్రావు, మానవతా సభ్యులు పావులూరి మధు, దావులూరి ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు/ఉంగుటూరు : గుండుగొలను ఫీడర్ ప్రాంతాల వారికి సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా సరఫరా ఆగిపోతుందని ఈ విషయమై వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఈఈ అంబేడ్కర్ కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్య సంరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా ఇస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశాల మేరకు టీడీపీ మండలాధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు, టీడీపీ నాయకులతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కుక్కల మాధవరావు, ముళ్లపూడి శ్రీనివాస్, ధర్మేంద్ర ప్రభాకర శాస్త్రి, కోన అప్పారావు, ఎలికే ప్రసాద్, ఎరమళ్ళ సుబ్బారావు, డి.రామకృష్ణ, వీరపండు, లింగాల సత్యనారాయణ, ఎం.నాగ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జనసేన పార్టీలోకి చేరికలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని 6వ డివిజన్ మాదేపల్లి రోడ్డు, ఇందిరా కాలనీకి చెందిన సుమారు 50 మందికి పైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు దోసపర్తి రాజు ఆధ్వర్యంలో ఏలూరు జనసేన పార్టీలో చేరారు. ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ ఏలూరు జనసేన ఇన్‌చార్జీ రెడ్డి అప్పలనాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, సీనియర్ నాయకులు రాఘవయ్యచౌదరి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరుతున్నారని అన్నారు.

ఒకటి నుంచి ప్రజ్ఞ వేసవి శిబిరం

కైకలూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కైకలూరు వికాస తరంగిణి ఆధ్వర్యంలో 7 నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రజ్ఞ వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షురాలు చిట్టి హేమలత తెలిపారు. కైకలూరు శ్రీమీసాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో మే 1వ తేదీ నుంచి 15 వరకు వేసవి శిబిరం నిర్వహిస్తామన్నారు. దీనిలో కల్చర్, ట్రెడిషన్, భజనలు, కీర్తనలు, శ్లోకాలు, ప్రార్ధనలు, నైతిక విలువలు, యోగా, ఆటలు, చిత్రలేఖనం, సేవా కార్యక్రమాలు వంటి వాటిపై పిల్లలకు శిక్షణ ఇవ్వనున్నారు. మరిన్ని వివరాలకు 9849622164 నెంబరును సంప్రదించాలన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

చాట్రాయి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి మే 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ శ్రీకాంత్ తెలిపారు. ఈ శిబిరంలో ప్రతి రోజు విద్యార్థులకు పిల్లలకు కథలు వినటం, పుస్తకాలు చదవటం, కథలు చెప్పటం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, జనరల్ నాలెడ్జి, క్విజ్, క్యారమ్స్, చెస్, ఇండోర్ గేమ్స్‌పై శిక్షణ ఇచ్చి వారికి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

చేపల ఎగుమతిలో రాష్ట్రం ముందంజ

నూజివీడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రెట్టింపుచేసి రాష్ట్రప్రభుత్వం విడుదల చేయటం జరిగిందని సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోనే లక్షా29వేల మత్స్యకార కుటుంబాలకు రూ.259కోట్ల లబ్ధిచేకూరిందన్నారు. మత్స్యకారులకు ఆర్థిక సహాయాన్ని రూ.10వేల నుంచి రూ. 20వేలకు పెంచామన్నారు. ప్రజలందరికి సంక్షేమం అందించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. రాష్ట్రంలో 550 మత్స్యకార గ్రామాలు ఉన్నాయని, చేపల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే మత్స్యసంపదలో 29శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే ఉంటోందని, ఎగుమతుల్లో 32శాతం ఎగుమతి చేస్తున్నామన్నారు. మత్స్య ఉత్పత్తుల ద్వారా 17లక్షల మందికి ఉపాధిలభిస్తోందని మంత్రి సారథి అన్నారు.



వింజరంలో పోల్‌రాజ్ లాకుల నుంచి నీటిని విడుదల చేస్తున్న డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు

శివారు గ్రామాలకు తాగునీరు విడుదల

కైకలూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శివారు గ్రామాల్లో మంచినీటి చెరువులను యుద్ధప్రాతిపాదికన నింపుకోవాలని కైకలూరు డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. ఆదివారం కైకలూరు మండలం వింజరంలో పోల్‌రాజ్ కెనాల్ పంటకాలువ లాకులు తెరిచి దిగువకు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరి వరకు కాలువ వస్తున్న నేపథ్యంలో కొండూరు, కాళ్ళపాలెం, దొడ్డిపట్ల, రామవరం ఆయా గ్రామాల్లోని మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకుని వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు, నీటి సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి చెరువులు నింపాలన్నారు. నీరు అక్రమ చౌర్యానికి పాల్పడకుండా రైతులందరూ సహకరించాలని కోరారు. జలవనరుల శాఖ ఏఈ సురేష్ మాట్లాడుతూ వేసవిలో మంచినీటి ఎద్దడి నివారించేందుకే పంటకాలు వలకు నీరు విడుదల చేస్తున్నామని ఎక్కడైనా రైతులు అక్రమంగా చేపలు, రొయ్యల చెరువులకు తరలిస్తే ఇంజన్లు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీసీ వైస్ చైర్మన్ వేటుకూరి పెద్దిరాజు, తామరకొల్లు నీటి సంఘం అధ్యక్షుడు గంగుల ఏసురాజు, టీడీపీ నాయకుడు కాంట్రాక్టర్ కృష్ణంరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణారావు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా దాసరి పోరాటం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి):బడుగు జీవుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ఉద్యమాలను విలువలతో కూడిన రాజకీయ ప్రస్థానాన్ని నడిపిన పోరాట యోధుడు దాసరి నాగభూషణరావు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. దాసరి నాగభూషణరావు 17వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామం దిగవల్లి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌భవన్ వద్ద దాసరి విగ్రహానికి వనజ నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, ఏలూరు జిల్లా రైతుసంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు, దిగవల్లి పీఏపీఎస్ మాజీ అధ్యక్షులు గుంటక ధర్మారెడ్డి, మిట్టగూడెంమాజీ సర్పంచ్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్డి అప్పలనాయుడుకు సన్మానం

నూజివీడు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కార్మికరంగానికి రెడ్డి అప్పలనాయుడు చేస్తున్న సేవలు అమూల్యమైనవని ఐఎఫ్‌టీయూ ఉమ్మడిజిల్లా కోశాధికారి నాగరాజు అన్నారు. నూజివీడు పట్టణంలోని ఎమ్మార్‌అప్పారావుకాలనీలో ఐఎఫ్‌టీయూ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డిఅప్పలనాయుడు ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాము ఈ స్థాయికి రావడానికి ఐఎఫ్‌టీయూ ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ప్రెసిడెంట్ దేవుడు, బోను సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కైకలూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరులో నియోజకవర్గంలో పలువురు వైద్యసహాయానికై సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూ.8,58,259 సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

టెన్త్ మండల టాపర్ రేవతికి సన్మానం



చాట్రాయి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): టెన్త్ పరీక్షా ఫలితాలలో 576 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని పరసా రేవతిని ఆదివారం చిన్నంపేటలో స్థానికులు ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబానికి చెందిన పరసా చెన్నారావు, విజయలక్ష్మి దంపతుల కుమార్తె అయిన రేవతి చిన్నతనం నుంచి చదువులో మంచి ప్రతిభ చూపేదని, టెన్త్‌లో మండల టాపర్‌గా నిలవటం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొమ్ము ఆనందం, సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాసరావు, టైలర్స్ యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మి, జ్యోతి, సత్యవాణి, నాగమణి, అనిత పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

ఉగ్రవాదుల దాడులపై నిరసన

ఆగిరిపల్లి ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిపిన ఉగ్రదాడిని ఖండిస్తు ఆగిరిపల్లిలో ముస్లింలు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఉగ్రవాదుల కాల్పులు అత్యంత హేయమైన పిరికిపంద చర్య అన్నారు. దాడి కి తెగబడిన ఉగ్రవాదుల పట్ల ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో షేక్ సుభాని, ఇలియాజ్, రంజానీ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు వాహనాలు

ఐదేళ్లుగా పట్టించుకోని పోలీస్ అధికారులు

ముసునూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముసునూరు పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలు శిథిలమైపోతున్నాయి. ఐదేళ్ళయినా పోలీస్ ఉన్నతాధికారులు వాహనాల వేలం నిర్వహించడం లేదు. సుమారు 150పైగా ఉన్న వాహనాల్లో ఆటోలు, కార్లు సగం పైగా శిథిలమయ్యాయి. బైకులు శిథిలా వస్థకు చేరుతున్నాయి. ఐదేళ్ళల్లో ఒక్కసారి కూడా వాహనాల వేలం నిర్వహించకపోవడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం తగ్గిపోతున్నది.



తుప్పుపట్టి పాడవుతున్న వాహనాలు



ముసునూరులో సమావేశమైన పూర్వ విద్యార్థులు



అగిరిపల్లిలో పూర్వవిద్యార్థుల కలయిక

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముసునూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జడ్పీపాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 2005 -06 బ్యాచ్ విద్యార్థులు అప్యాయంగా పలకరించుకుని, చిన్ననాటి మధుర స్మృతులు నేమరవేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయినీ దీవెనమ్మ, ఉపాధ్యాయులు ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రవీంద్రలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు కొడవలి శ్రీను, మహేష్, తాయారు, మధు, చంద్రిక, రామలక్ష్మి ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం జరిగింది. పాఠశాల అభివృద్ధికి తమవంతుగా సహకారం అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2005-06 సంవత్సరానికి చెందిన పదోవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆగిరిపల్లి పాఠశాలలో నిర్వహించినారు. విద్యార్థులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకోవడాన్ని మించిన ఆనందం ఇంకొకటి లేదని అన్నారు. స్కూల్లో చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులకు సన్మానించారు.

ఎన్‌హెచ్ అభివృద్ధి పనులకు బుసక టిప్పర్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

నియోజకవర్గ సరిహద్దులు దాటితే చర్యలు

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనులు నవంబరు నాటికి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు బైపాస్ రహదారి 9కిలోమీటర్ల మేర విస్తరణ పనులు జరుగుతున్నాయని బుసక తోలకాలు అవసరమైన నేపథ్యంలో టిప్పర్ల ద్వారా తోలుకునేందుకు వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. రహదారి నిర్మాణానికి 10వేల టిప్పర్లు బుసక అవసరమున్నందున అనుమతి ఇస్తున్నామని లేకుంటే కాంట్రాక్టర్ పనులు నిలిపి వేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎక్కడైనా టిప్పర్లు రాకపోకలతో రహదారులు ధ్వంసమైతే వాటి మరమ్మతులు వారే నిర్వహించేలా మాట్లాడానన్నారు. బైపాస్ రహదారి మినహా ఎక్కడైనా టిప్పర్లు తిరిగినట్లుంటే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసు, రెవెన్యూ అధికారులతో పాటు తన దృష్టికి కూడా తీసుకురావాలని ఆయన కోరారు. అక్రమ రవాణాలను అడ్డుకుని అభివృద్ధికి పునాదులు వేయవలసిని అవసరముందన్నారు. ఇటీవల పుల్లవా డ్రెయిన్ అభివృద్ధి పనులు చేపట్టామని ప్రభుత్వం ఇస్తున్న నిధులు చాలకపోగా అదనంగా రూ.25లక్షల నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి ఉందన్నారు. మండవల్లి మండలం భైరవపట్నం నుంచి కైకలూరు మండలం పల్లెవాడ వరకు విస్తరణ పనులు జరుగుతున్నాయని ఎక్కడైనా టిప్పర్లు ద్వారా బుసక తోలకాలను ఇతర జిల్లాలకు తరలిస్తే చర్యలు తీసు కుంటామన్నారు. గతంలో టిప్పర్లు రవాణాను నిలి పివేసిన సంగతి ఆయన గుర్తు చేశారు. కేవలం అభివృద్ధి కోసమే టిప్పర్ల ద్వారా బుసక తోలకాల ను అనుమతి ఇస్తున్నామన్నారు. రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి కరువు

ముదినేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. స్థానికంగా వ్యవసాయ పనులు లేక ఉపాధి పనులు నిర్వహించకపోవటంతో కూలీలకు ఉపాధి కరువైంది. ముదినేపల్లి మండలం ములకలపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రస్తుత సీజనులో ప్రారంభం కాలేదు. ఆ గ్రామంలోని జాబ్ కార్డు హోల్డర్లకు ఉపాధి పనులు లేకుండాపోయాయి. దీంతో ఆ గ్రామ దళితవాడకు చెందిన పలువురు దూర ప్రాంతాల్లోని ఇతర గ్రామాలకు కూలి పనులకు వెళ్లాల్సి వస్తున్నది. నాలుగు కుటుంబాలు ఇప్పటికే పనుల కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లారు. గ్రామంలో ఉపాధి పనుల్లేక జాబ్ కార్డు హోల్డర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



పనులు కల్పించాలి : జంగం తాతారావు

తమ గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభంచలేదు. పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇతర కూలి పనులు కూడా కరువయ్యాయి.



ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది: జంగం అనిత కుమారి

గ్రామంలో పనుల్లేక కుటుంబ పోషణ ఇబ్బందికరంగా ఉంది. వ్యవసాయ పనులు లేవు. ఉపాధి పనులు లేకపోవటంతో కూలీలు పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నది.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ముదినేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం కాకరవాడ గ్రామ సమీపంలో జరుగుతున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ముదినేపల్లి ఎస్‌ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడి నిర్వహించి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.4500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

తాగునీటి చెరువులు నింపడానికి చర్యలు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్టు

కలిదిండి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులను నింపటానికి చర్యలు తీసుకుం టున్నామని ఇరిగేషన్ ఏఈఈ ఫణికుమార్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన లంక గ్రామాల్లో "అడుగంటిన తాగునీటి చెరువులు" శీర్షికన కథనానికి అధికారులు స్పందించారు. గుడ్లవల్లేరు లాకుల వద్ద సీబీ కెనాల్‌కు సుమారు 300 క్యూసెక్కుల తాగునీరును ఆదివారం సాయంత్రం విడుద లచేస్తారన్నారు. సోమవారం నుంచి లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరవులకు నీటివంతు సరఫరా అవుతుందన్నారు.

మత్స్యకారులకు సహాయం పెంపు హర్షణీయం

కైకలూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వేట నిషేధ సమయంలో రూ.20వేలు సహాయాన్ని అందించడం అభినందనీయమని కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాల అభ్యున్నతికి పనిచేసింది తెలుగుదేశంపార్టీ అని 2014-19 మధ్య వారి సంక్షేమం కోసం రూ.788కోట్లు ఖర్చు పెట్టామని అంతేగాకుండా ఉచితంగా వలలు, పడవలు, ఐస్‌బాక్సులు పంపిణీ చేశామన్నారు. ఇప్పుడు వేట నిషేధ సమయంలో నెలకు ఒక్కొక్క మత్స్యకారుడికి రూ.20వేలు అందిస్తున్నామని అన్నారు. దీంతో రాష్ట్రంలో మత్స్యకారులకు రూ.259కోట్లు లబ్ధి చేకూరిందని ఇది ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



విరాళం చెక్కును అందజేస్తున్న ట్రస్ట్ కార్యదర్శి చెన్నంశెట్టి కృష్ణ

రామాలయానికి రూ.2,02,440 విరాళం

కలిదిండి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు యాదవపాలెంలో రామాలయం ప్రహరీ నిర్మాణానికి ఎన్నారై వఱ్ఱే వెంకట సత్య నారాయణ - నీరజ దంపతులు రూ.2,02,440ల చెక్కును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వఱ్ఱే జగన్నాథం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చీకటి లక్ష్మణరావు, కార్యదర్శి చెన్నంశెట్టి కృష్ణ, ఆమజాల బాబులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాలి : ఎమ్మెల్యే



ముదినేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యాసంస్థలు కృషి చేయాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. పెయ్యేరు ఆటోనగర్‌లో ఆదివారం జరిగిన ఎ లిటిల్ ఫ్లవర్ ది లీడర్ హైస్కూలు వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కామినేని మాట్లాడుతూ వివిధ రంగాల్లో నిష్ణాతులుగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. ఇస్రో సైంటిస్టు (చంద్రయాన్ -3) రాజా వీఎల్‌ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి కొత్త ఆవిష్కరణలతో దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా తయారు కావాలన్నారు. లిటిల్ ఫ్లవర్ ది లీడర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బొర్రా చలమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, రిటైర్డ్ హెచ్‌ఎం బొర్రా సాయిరాజు, డైరెక్టర్ కొత్తూరు వేణు, టీడీపీ నాయకులు కోడూరు శేషుబాబు, తాడినాడ బాబు, బీజేపీ, జనసేన నాయకులు కోటప్రోలు కృష్ణారావు, వీరంకి వెంకటేశ్వరరావు, గుడివాడ ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చింతపల్లి సుగుణావతి పాల్గొన్నారు.



అట్లూరి ట్రస్టు సాయం

ముసునూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి బీసీ కాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పేరం సుబ్బారావు కుటుంబానికి అట్లూరి ఛారిటిబుల్ ట్రస్ట్ అపన్నహస్తం అందించింది. ట్రస్ట్ చైర్మన్ అట్లూరి వెంకట రవీంద్ర అందించిన రూ.15వేలు విలువ గల బట్టలు, వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులతోపాటు రూ.2వేల నగదును సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ కందుల పిచ్చియ్య, లక్కపాము కాంతరావు అందజేశారు.

పెద్దింటి అమ్మవారికి భక్తుల తాకిడి



కైకలూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం కైకలూరు మండలం కొల్లేటికోటలో అమ్మవారిని ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కుబడులను చెల్లించుకున్నారు. కోనేరులో స్నానాలు ఆచరించి ఆలయ అధికారులు ఏర్పాటుచేసిన చలువపందిళ్లలో పాలపొంగళ్ళను పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ముదినేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దేవస్థానంలోని పుట్టలో పాలు పోసి నాగ ప్రతిమలకు పూజలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల పొంగళ్ల నిర్వహించి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. దేవస్థానం ఏసీ ఆర్.గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపటి నుంచి నియోజకవర్గ క్రికెట్ పోటీలు

ముదినేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవపూడి గ్రామంలో ఏప్రిల్ 29 నుంచి కైకలూరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్స్ జరుగుతాయి. ఈ పోటీలు 20 రోజులపాటు జరుగుతాయి. పలు టీమ్‌లు పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీలు నమోదు చేసుకున్నాయని పోటీల కన్వీనర్ గూడవల్లి ముసలయ్య తెలిపారు. పోటీల్లో ప్రథమ స్థానం పొందిన టీమ్‌కు రూ.20 వేలు, ద్వితీయ స్థానం పొందిన టీమ్‌కు రూ.10 వేలు, తృతీయ స్థానం పొందిన టీమ్‌కు రూ.5 వేల నగదు బహుమతులతోపాటు బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్ అవార్డులు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆసక్తి కలిగిన టీములు తమ ఎంట్రీలు పంపవచ్చునని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల పనుల్లో భాగంగా సోమవారం ముదినేపల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలో ఐదు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఆక్వా, గృహ, వాణిజ్య వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు.

ఆకట్టుకున్న అల్లూరు విద్యార్థుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారులు

ముదినేపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏలూరులోని బాల వికాస కేంద్రం పాఠశాల వార్షికోత్సవంలో ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ వార్షికోత్సవంలో జిల్లాలోని పది పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా, అల్లూరు విద్యార్థులు వందేమాతరం జాతీయ గీతం, భరత మాత గేయాలతో నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యురాలు అల్లూరుకు చెందిన రెడ్డి రాధిక ఆధ్వర్యంలో సుశిక్షితులైన విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొని అందరి మన్ననలు పొందారు.

మాదకద్రవ్యాల జోలికెళ్లొద్దు : ఏఎస్పీ సూర్య చంద్రరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు అంధకారమవు తోందని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎస్.సూర్య చంద్రరావు అన్నారు. ఏలూరు సమీపంలోని దుగ్గి రాలలోని డీపాల్ కాలేజీ ప్రాంగణంలో 19(ఎ) బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక శిక్షణ క్యాంపు కాలేజీ విద్యా ర్థులకు ఆదివారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న అదనపు ఎస్పీ ఎస్.సూర్య చంద్ర రావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల ముఠాను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఈగల్ టీమ్ ఏర్పాటు చేశారన్నారు. మాదకద్రవ్యాల విక్రయిస్తున్నట్టు తెలిస్తే వెంటనే 112కు సమాచారం ఇవ్వాలన్నారు.

మా రికార్డులు.. మాకున్నాయి!

(ఐదో పేజీ తరువాయి)

శాటిలైట్ సర్వే ద్వారా తెలుస్తోందని, ప్రభుత్వ భూమి ఉన్న చెరువులను స్వాధీనం చేసుకుంటున్నట్టు తెలిపారు. రైతులకు మూడు నెలల నుంచి గడువు ఇస్తూనే ఉన్నామన్నారు. అలాగే గండి కొట్టిన చెరువుల పరిధిలో చుట్టుపక్కల 780 మీటర్ల వరకు ఎటువంటి వరిపొలాలు లేవని, కొంతమంది కాల్వకు అడ్డుకట్ట వేయడం వల్ల నీరు ముందుకు వెళ్లే మార్గం లేక వెనక్కి ఎగదన్నిందని, మోటార్లు వేసి చేలో నీరు తోడించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నీటమునిగిన పొలాల పరిశీలన



పంట చేలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నీట మునిగిన పంట చేల రైతులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. నిడమర్రు శివారు ప్రాంతంలో చేపల చెరువులకు గండ్లు కొట్టడం వల్ల నీరు వరి చేలలోకి చేరడంతో బాధిత వరి రైతులను ఆదివారం ఆయన పరామర్శిం చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు ముగ్గళ్ళ యాకోబు, ఉమామహేశ్వరరావు, హరిబాబు పాల్గొన్నారు.